# ఆట



సాయంత్రం బడివొదిలారు. పిల్లలు కొందరు ఇండ్లకు వెళ్లారు. కొందరు పక్కగ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. ఫుట్-బాల్ తరహా బంతిని ఆడుతున్న వాళ్లను చూస్తు నిలుచున్నాడు శీను. కిటికిలో నుండి చూచిన టీచర్ శీనును పిలిచాడు. శీను కిటికి దగ్గరికి వెళ్లి నిలుచున్నాడు.

"ఏమి నీవు ఆడడం లేదు. అందరు ఆడుతున్నారు" అని అడిగాడు.

"వాళ్లతో ఆడొద్దన్నారు సార్"

"ఎందుకట?"

శీను గోళ్లు గిల్లుకుంటు నిలుచున్నాడు.

"వరె, గోళ్లు గిల్లొద్దని నీకు ఇదివరకు ఓసారి చెప్పినట్టు గుర్తు"

అవును అన్నట్టు తలాడించాడు.

"ఆజేబులోనిది ఏమిటి ?"

"బంతిసార్"

"నీ దగ్గర బంతి వుంది. ఇద్దరు ముగ్గురు కలిసి దాంతో ఆడుకోవచ్చుగా"

అవును అన్నట్లు చూశాడు.

"మరి ఎందుకు ఆడడంలేదు"

"ఎవ్వరు రావటంలేదు సార్"

"అట్లాగ" అంటు ఎందుకని ఆలోచనల్లోకి వెళ్లాడు.

"నీవు ఈ బాల్ ఎప్పుడు కొన్నావు"

"వారం రోజులైంది" జారుతున్న నిక్కర్‌ను పైకి లాక్కుంటు అన్నాడు.

"వారం రోజులనుండి వాళ్లెవరు ఆ బాల్‌తో ఆడుకోలేదా ?"

ఈసారి శీను తలవంచుకున్నాడు.

"చెప్పవేంరా" టీచర్ కాస్త గట్టిగ అన్నాడు.

"నా బంతిని నేను ఎవర్కి ఇవ్వటంలేదు సార్"

"అదీ కథ"

"వాళ్లు ఆడుకుందాం అనివచ్చారా ?" కిటికి సువ్వలను పట్టుకొని అడిగాడు.

వచ్చారు అన్నట్లు తలాడించాడు.

"అప్పుడు వాళ్లకు బాల్‌లేదు, నీ బాల్‌తో ఆడుకుందాం అన్నానువ్వు ఇవ్వలేదు. వాళ్ళే నలుగురు కలిసి నీకంటే పెద్దబాల్‌కొనుక్కున్నారు. అందరు కలిసి ఆడుతున్నారు. ఇప్పుడు నిన్ను వాళ్లు రానివ్వటం లేదు. అంతేనా ?"

"అవును సార్"

"తప్పురా, తప్పు. ఆట అంటే నలుగురు కలిసి ఆడుకుంటేనే ఆనందం. నీకు బాలున్న వంటరివి. కాసేపు గోడకో, నేలకో కొట్టి ఇంటికిపోతావు అంతేనా ? అది ఆటకిందికి రాదు", శీను తలెత్తి శ్రద్ధగ వింటున్నాడు.

"చూడు మనం ఒకరికిస్తే మనకు ఎదుటివాడు తిరిగిస్తాడు. అది సహకారమే కావొచ్చు, ప్రేమే కావొచ్చు. ఇచ్చి పుచ్చుకోవడం లోనే స్నేహం పెరుగుతుంది. మాట, ఆట మనుషులను దగ్గరికి చేరుస్తుంది."

ఈసారి శ్రీను ముఖం విప్పారినట్లయింది. అంతవరకు తాను అనుభవిస్తున్న సంకుచితభావం పటాపంచలైంది.

"నేను వాళ్లను పిలిచి చెపుతాను వాళ్లతో కాసేపు ఆడుకో" అని చప్పట్లు కొట్టి సతీష్‌ను పిలిచాడు. టీచర్ చప్పట్లు విని అందరు ఆడడం ఆపి కిటికివైపు చూశారు.

'రండి' అన్నట్లు కిటికిలోనుండి చేయి ఊపాడు. అందరు కిటికి దగ్గర్కి వొచ్చి నిలుచున్నారు. సతీష్ చేతిలో బాలుంది.

"ఈ బాల్ ఎప్పుడు కొన్నారు."

"ఈరోజే సార్"

"ఏమాట ఆడుతున్నారు"

"ఏదో వుత్తత్త ఫుడ్‌బాలాట" అన్నాడు సతీష్.

"అచ్చా, మరి శ్రీను మీతో ఎందుకు ఆడడం లేదు"

"ఆయన మాతో ఆడడు సార్"

"మీరు పిలిచారా."

"నిన్న మొన్న ఆయన దగ్గర బాలుండె సార్, మమ్ముల ఎవ్వర్ని ఆడనివ్వలేదు. ఇక మేమే నలుగురం కలిసి -"

"ఈ బాల్‌కొన్నారు. మీరు అతన్ని ఆడనివ్వడంలేదు. వాడుచేసిన పొరపాటే మీరు చేస్తువున్నారు. అవన్నీ మరిచిపోయి శ్రీనును మీతో ఆడనివ్వండి" అన్నాడు టీచర్.

అందరు మౌనంగ నిలుచున్నారు.

"వెళ్ళండి అందరు కలిసి ఆడుకోండి. మీ బాల్‌తో ఫుడ్‌బాల్ ఆట ఆడితే వాని బాల్‌తో వాలిబాల్ ఆట ఆడండి, సరేనా".

"వాడు బాల్ ---" ఇవ్వడు అన్నట్లు చూశారు.

"యిస్తాడు, శ్రీను నీ బాల్ యివ్వు అనగానే శ్రీను తనబాల్ సతీష్‌కిచ్చాడు. అందరు గ్రౌండ్‌లోకి నడిచారు.

అందరు కల్సి ఆడితేనే అదో ఆనందం.

●